

ధారాలమ్మకు వెండి తోరణాలు

పొల్లూరులో ధారాలమ్మ తల్లి జాతర పురస్కరించుకొని అమ్మవారికి భక్తులు వెండి తోరణాలు సమర్పించారు. 10లో



ఘాట్‌లో లారీ బోల్తా

చింతూరు ఘాట్ రోడ్డులో ఓ లారీ బోల్తా పడింది. మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. 10లో



సీతాఫలం రైతుకు ఊరట

అనంతగిరి మండలంలోని కాశీపట్నం వారపు సంతలో సీతాఫలాలకు గిరి రైతులు ఊహించని విధంగా ధర లభించింది. 10లో

న్యూస్‌రీల్

అమరజీవికి ఘన నివాళి

- నివాళి అర్పించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పెందుర్తి (విశాఖ): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వేపగుంటలోని గిరిజన యూత్ శిక్షణ కేంద్రంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి వి.ఎస్ ప్రభాకరరావు, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



సుజనకోట గిరిజనులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమాండెంట్ నవల కిషోర్ చౌదరి

ముంచంగిపుట్టు: గిరి యువత అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నవల కిషోర్ చౌదరి సూచించారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో బుధవారం సీఆర్‌పీఎఫ్ ఈ198 బెటాలియన్ ఆధ్వర్యంలో స్కిల్ డవలప్‌మెంట్ ,సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో వారికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా నవల కిషోర్ చౌదరి మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్ ద్వారా కంప్యూటర్ కోర్స్,బైక్ మెకానిక్, కుట్టు శిక్షణ అందిస్తామన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి పోలీసుశాఖ నిరంతరం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్, ఎస్‌ఐ రవీంద్ర, సీఆర్‌పీఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ శివరాజ్‌సింగ్, సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

సాక్షి,పాడేరు: జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఎస్పీ (అడ్మిన్) పులిపాటి అనిల్‌కుమార్‌తో సహా పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని ఉత్తమ పోలీసు పతకాలు వరించాయి. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఉత్తమ సేవలు అందిస్తున్న పాడేరు ఏఎస్పీ అనిల్‌కుమార్, ఎస్‌ఐ బాణాల యాదగిరి, హెచ్‌సీ బొండ విజయగిరి, డీఏఆర్ విభాగం పోలీసు కానిస్టేబుళ్లు తాడివాడ మణికంఠ, కూంద్రపు గణేష్ కూడా కఠిన సేవా పతకాలకు ఎంపికయ్యారు. అడ్డతీగల ఎస్‌ఐ నల్ల హనుమంతరావు, మోతుగూడెం ఏఎస్‌ఐ సంగాన వెంకటేశ్వరరావు, పెదబయలు హెచ్‌సీ దేవాదుల కామేశ్వరరావు ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

మరో అంతర్జాతీయ సదస్సుకు
విశాఖ ముస్తాబు



దొండపర్తి : మరో అంతర్జాతీయ సదస్సుకు విశాఖ సిద్ధమైంది. అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన ఐసీఐడీ కాంగ్రెస్ ప్లీనరీకి వేదికవుతోంది. 74 దేశాల అంబాసిడర్లు, మంత్రులు, ఇతర ప్రతినిధులకు అతిథ్యమిస్తోంది. ఇప్పటికే జీఐఎస్, జీ20 సదస్సులతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన విశాఖలో గురువారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ సదస్సు జరగనుంది. 57 ఏళ్ల తరువాత భారత్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు విశాఖ వేదికవడం విశేషం. సెంట్రల్ వాటర్ కమిషన్, ఏపీ జలవనరుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఈ సదస్సును గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 'వ్యవసాయం నీటి కొరతను అధిగమించడం' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఐసీఐడీ అధ్యక్షుడు డాక్టర్ రాగబ్, ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో పాటు భారత్ నుంచి 300 మంది హాజరుకానున్నారు. అలాగే ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, చైనా, ఇండోనేషియా, ఇరాన్, ఇరాక్, ఇజ్రాయిల్, జపాన్, కొరియా, మలేషియా, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం ఇలా 74 దేశాల నుంచి 900 మందికి పైగా ప్రతినిధులు రానున్నారు. ఇదే వేదికపై 74వ అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఐఈసీ) సదస్సు కూడా జరగనుంది. తొలిరోజు ప్రముఖుల కీలక ఉపన్యాసాలు ఉండగా.. 3, 4, 5, అలాగే 9వ తేదీన విశాఖ పర్యాటక ప్రాంతాలైన అరకు వ్యాలీ, బొర్రా గుహలు, తాటిపూడి రిజర్వాయర్ వంటి ప్రాంతాలను సందర్శించనున్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ సదస్సు విజయవంతంగా పూర్తయ్యేందుకు పోలీసులు 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యాధునిక నీటి పారుదల విధానాలపై..

ప్రపంచానికి జలభద్రత చేకూర్చడం, తక్కువ నీటితో అధిక విస్తర్ణంలో పంట సాగుకు దోహదం చేసే అత్యాధునిక నీటి పారుదల విధానాలపై సమావేశంలో చర్చించి ప్రదర్శించనున్నారు. 25వ కాంగ్రెస్ నిర్వహణ బాధ్యతలను భారత్ చేజిక్కించుకోగా.. సదస్సును విశాఖలో నిర్వహించాలని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ కె.యల్లారెడ్డి చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదించారు. 74 దేశాలకు చెందిన మేధావులు, ప్రతినిధులు ప్రతిపాదించే అత్యాధునిక సాగునీటి విధానాలను పరిశీలించి వాటిని అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా, సుభిక్షంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

తొలి రోజు ఇలా..

- గురువారం ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది.
- 9.35కు కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి దేబాశ్రీముఖర్జీ ప్రారంభోపన్యాసం చేస్తారు.
- 9.45కు ఐసీఐడీ అధ్యక్షుడు డాక్టర్ రాగబ్ సదస్సు విశేషాలను వివరిస్తారు.
- 9.55కు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు.
- 10.15కు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడతారు.
- 10.40కు ఐసీఐడీ చేసిన పబ్లికేషన్స్‌ను విడుదల చేస్తారు.
- 10.45కు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్ అవార్డులను అందజేస్తారు.
- 10.55కు ఐసీఐడీ ఉపాధ్యక్షుడు కుష్విందర్ ఓహ్రా వందన సమర్పణ చేస్తారు.

నేడు సీఎం జగన్ విశాఖ రాక



మహారాణిపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఉదయం 8.05 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 8.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో మధురవాడ ఐటీ హిల్ నెంబర్.3లో ఉన్న హెలిప్యాడ్‌కి 9.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా రుషికొండలోని రాడిషన్ బ్లూ రిసార్ట్‌కు వెళ్తారు. అక్కడ జరగనున్న 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్(ఐసీఐడీ) కాంగ్రెస్ ప్లీనరీలో 9.30 గంటల నుంచి 11 గంటల వరకు పాల్గొంటారు. అనంతరం రోడ్డుమార్గంలో మధురవాడ హెలిప్యాడ్‌కు 11.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 11.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

వణికిస్తున్న చలి గాలులు

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. మరోపక్క చలిగాలులు విజృంభిస్తున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.6 డిగ్రీలు,అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 14.8డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 15డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. సాయంత్రం 6గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి.



పాడేరు ప్రాంతంలో కురుస్తున్న పొగమంచు

రాత్రి సమయంలో గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.అర్ధరాత్రి నుంచి ఉదయం 9గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తోంది.

59.2 శాతం మేర పింఛన్ల పంపిణీ

సాక్షి, పాడేరు: జిల్లాలోని 22 మండలాల్లోని గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచే వైఎస్సార్ పింఛన్‌కానుక సొమ్ము పంపిణీని గ్రామ వలంటీర్లు చేపట్టారు. జిల్లాలో లక్షా 28వేల 448మంది పింఛనుదారులు ఉండగా బుధవారం రాత్రి వరకు 76,045 మందికి నగదు అందజేయగా 59.2 శాతం నమోదైంది. పింఛన్ల పంపిణీలో జిల్లాలో అత్యధికంగా కూనవరం మండలం ప్రథమస్థానంలో నిలిచింది. మొత్తం 3959 మందిలో 3201మంది పింఛనుదారులకు పంపిణీ చేయగా 80.85శాతం నమోదైంది. ఈనెల ఐదో తేదీలోగా జిల్లా వ్యాప్తంగా నూరుశాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ మురళీ తెలిపారు.

కూరగాయల వ్యాన్ బోల్తా

- ఇద్దరికి తీవ్ర గాయాలు



హెయిర్‌పిన్ బెండ్ వద్ద బోల్తాపడిన వ్యాన్

అనంతగిరి: మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డుదముకు సమీపంలోని హెయిర్‌పిన్‌బెండ్ 5 మలుపు వద్ద కూరగాయల లోడు వ్యాన్ మంగళవారం అర్ధరాత్రి అదుపుతప్పి బోల్తా కొట్టింది. బరంపూర్‌కు చెందిన వాహన యాజమాని సలీం, డ్రైవర్ అన్సీరెడ్డి అరకులోయ నుంచి కూరగాయాలతో లోడుతో భువనేశ్వర్ వెళుతుండగా వ్యాన్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. వారిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అర్ధరాత్రి ప్రమాదం జరగడంతో క్షతగాత్రులు వాహనం వద్దనే ఉండిపోయారు. బుధవారం ఉదయం వారిని ఎస్‌కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కష్టపడితే విజయం తథ్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- సివిల్స్ ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభం



శిక్షణ అధికారులను సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

పెందుర్తి (విశాఖ): అంకితభావంతో కష్టపడి సాధన చేస్తే అత్యుత్తమ ఫలితాలు తథ్యమని అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. వేపగుంటలోని గిరిజన శిక్షణ సంస్థలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన యువతకు అందిస్తున్న సివిల్స్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్స్ చదువుతున్న విద్యార్థుల విజయాలు మిగిలిన యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు క్రమశిక్షణ, అంకితభావం ముఖ్యమన్నారు. సమయం ఉన్నప్పుడు ఆంధ్రా మెడికల్ కళాశాలలోని లైబ్రరీని సందర్శించి అక్కడ వైద్య విద్యార్థులు చదువుతున్న విధానాన్ని పరిశీలించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతీ రోజూ పత్రికలను ఒక పాఠ్యాంశంగా చూడాలన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ప్రభుత్వ కొలువులు సాధించడమే లక్ష్యంగా యువత ముందడుగు వేయాలని సూచించారు. ఐటీడీఏ అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 65 మంది యువతను ఎంపిక చేసి తొమ్మిది నెలల శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణకు సహకరిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవోలు ఎల్.రజని, అఖిలారెడ్డిలను ఘనంగా సత్కరించారు. అనంతరం శిక్షణకు ఎంపికైన విద్యార్థుల డార్మెటరీని ప్రారంభించారు. 21వ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత ధరణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోషణ అభియాన్ ప్రాజెక్ట్‌లో ఉద్యోగాలు

- అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 10వ తేదీ వరకు గడువు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్ : జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత కార్యాలయంలోని అంగన్‌వాడీ పోషణ అభియాన్ ప్రాజెక్టులో కాంట్రాక్ట్ పద్ధతిపై వివిధ కేటగిరిల్లో పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్ ఒకటి, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ ఒకటి, బ్లాక్ కో ఆర్డినేటర్లు 11 పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు 2023 జూలై ఒకటవ తేదీ నాటికి 25 సంవత్సరాలు నిండి 40 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అర్హతలు, అనుభవం, తదితర వివరాలను జిల్లా వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి అన్ని ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలతో గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో ఈనెల 10వ తేదీలోగా అందజేయాలని సూచించారు. కార్యాలయ పనిదినాల్లో పాడేరు తలార్‌సింగిలోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి కార్యాలయానికి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా స్వయంగా గాని సమర్పించాలని సూచించారు. ఎటువంటి నోటీసు లేకుండా నియమకాలను పాక్షికంగా లేదా పూర్తిగా రద్దు చేసే అధికారం తమకు ఉందన్నారు.

రక్తహీనతతో బాలింత మృతి

రాజవొమ్మంగి: మండలంలోని వణకరాయి గ్రామానికి చెందిన మాకాడ లక్ష్మీదేవి (28) జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమె కొంతకాలంగా రక్తహీనతతో బాధపడుతోంది. జడ్డంగి పీహెచ్‌సీ వైద్యుల సిఫార్సు మేరకు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ మధ్య కాలంలో స్వగ్రామం వచ్చింది. ఇక్కడి నుంచి లోదొడ్డులోని పుట్టింటికి వెళ్లింది. అక్కడ ఉంటుండగా బుధవారం అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఏఎన్‌ఎం సహాయంతో జడ్డంగి పీహెచ్‌సీకి తరలించారు. అత్యవసర వైద్యం అందిస్తుండగా ఫిట్స్‌తో మృతి చెందినట్టు వైద్యాధికారి సేవా సుజి తెలిపారు. ఆమె లోదొడ్డిలో మూలికల వైద్యం తీసుకున్నట్టు ఆమె తెలిపారు.



లక్ష్మి మృతదేహం

కందిరీగల దాడి.. యువకుడికి తీవ్ర గాయలు

హుకుంపేట: కందిరీగల దాడిలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం అనంతగిరి, హుకుంపేట మండలాల సరిహద్దులో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రెండు మండలా సరిహద్దు ప్రాంతమైన పెదకోట పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన యువకుడు పాగురు భైరవమూర్తి వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామ శివారులోకి వెళ్లాడు. పనులు చేస్తుండగా కందిరీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన అతను స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న తోటి కూలీలు వెంటనే ఇంటి వద్దకు తీసుకువెళ్లారు. ఓ ప్రైవేటు ఆటోలో హుకుంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.



కందిరీగల దాడిలో గాయపడిన భైరవమూర్తి

సాక్షి చింతపల్లి విలేకరి నాగేశ్వరరావు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

గూడెంకొత్తవీధి: సాక్షి చింతపల్లి మండల విలేకరి నాగేశ్వరరావు అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామం గూడెంకు తరలించారు. సమాచారం తెలుసుకుని ఇక్కడకు వచ్చిన రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నర్సింగరావు, నాగేశ్వరరావు (45) భౌతికకాయంపై పూలమాల ఉంచి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి నాగేశ్వరరావు జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారని, సమాజాన్ని చైతన్యపరిచే అనేక వార్తా కథనాలు రాసి మంచి పేరు సంపాదించారన్నారు. అలాంటి వ్యక్తి అనారోగ్యంతో దూరం కావడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నాగేశ్వరరావు మృతికి మాజీ మంత్రి పి బాలరాజు సంతాపం తెలిపారు. చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య పడాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, గూడెం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీటీసీ నాగమణి, వైఎస్సార్ సోషల్ మీడియా విభాగం కన్వీనర్ టి. సురేష్, పార్టీ నేతలు అంజి, రామకృష్ణ, నాగేశ్వరరావు భౌతికకాయంపై పుష్ప గుచ్ఛం ఉంచి సంతాపం తెలిపారు. అంత్యక్రియలు గురువారం గూడెంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



నాగేశ్వరరావు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న నర్సింగరావు

నేటి నుంచి జిల్లా స్థాయి భజన పోటీలు

జి.మాడుగుల: మండలంలోని గాంధీనగరం హనుమాన్ ఆశ్రమం, పంచముఖ ఆంజనేయ స్వామి అలయంలో ఈనెల 2 నుంచి ఐదవ తేదీ వరకు జిల్లాస్థాయి భక్తి గీతాల భజన పోటీలు నిర్వహిస్తున్నట్టు భీమిలి సద్గురు సేవాశ్రమం, జి.మాడుగుల శ్రీ హనుమ సేవాశ్రమం ప్రతినిధి శ్రీ సాయిరాం స్వామీజి తెలిపారు. పోటీలు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతాయన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందజేస్తామన్నారు. ఇవికాకుండా ప్రతిరోజు భజన పోటీల్లో పాల్గొనే బృందానికి ధ్రువపత్రం రూ.వెయ్యి నగదు ఇవ్వడమే కాకుండా బృందం లీడర్‌కు సత్కరిస్తామని చెప్పారు. ఉచిత భోజన వసతి కల్పిస్తామని, పూర్తి వివరాలకు కార్యక్రమ నిర్వాహక కమిటీ సభ్యులు ఎం.మత్స్యరాజు,పైడిరాజు,రామానందచారి,నీలకంఠం,వి.శ్రీను,ఎ.శ్రీనును సంప్రదించాలని ఆయన కోరారు.

ఘాట్‌లో లారీ బోల్తా

మూడు గంటలు నిలిచిన వాహన రాకపోకలు

మారేడుమిల్లి: మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో బుధవారం ఓ లారీ బోల్తాపడింది. చత్తీస్‌గడ్ జిల్లా మల్కన్‌గిరి నుంచి ధాన్యం లోడుతో కాకినాడకు వెళ్తుండగా ఘాట్‌లోని వాలీసుగ్రీవ్ మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డును అనుకొని బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ సోన్, క్లీనర్ బుద్దుకు స్వల్ప గాయాలయ్యాయి. అదే మలుపులో చత్తీస్‌గడ్ వెళ్తున్న మరొక లారీ సాంకేతిక లోపంతో అడ్డంగా నిలిచిపోవడంతో ఇరు వైపులా సుమారు మూడు గంటలసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

ధారాలమ్మకు వెండి తోరణాలు

మోతుగూడెం: పొల్లూరులో ధారాలమ్మ తల్లి జాతర మహోత్సవం పురస్కరించుకొని అమ్మవారికి గ్రామస్తులు శివరామకృష్ణ, రమణ, పంచాడ సత్యనారాయణ కుటుంబ సభ్యులు వెండి తోరణం సమర్పించారు. వీరితోపాటు శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంధం ప్రకాష్ దంపతులు అమ్మవారి వెండి తోరణం అందజేశారు.

సింహాద్రి ట్రైన్‌కు సాంకేతిక సమస్య

గుల్లిపాడు సమీపంలో నిలిపివేత

నక్కపల్లి : గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న సింహాద్రి ట్రైన్‌కు బుధవారం సాయంత్రం సాంకేతిక సమస్యే ఏర్పడింది. నర్సీపట్నం రోడ్డు–గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో రైలుకు బ్రేక్‌లు ఒక్కసారిగా పట్టేసాయి. రైలు నిలిచిపోయి చివర బోగీల నుంచి పొగలు వచ్చాయి. ప్రయాణికులంతా రైలు దిగి పరుగులు తీశారు. 10 నిమిషాల పాటు రైలు నిలిచిపోయింది. ట్రైన్ సిబ్బంది వెంటనే సమస్య ఏర్పడిన బోగీల వద్దకు వచ్చి సమస్యను సరి చేయడంతో రైలు బయలు దేరింది. బ్రేక్‌లు పట్టేయడంతో చక్రాల నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయందోళనలు చెందారని తుని రైల్వే ఎస్‌ఐ మారూఫ్ తెలిపారు. సమస్య సరి చేసిన తర్వాత రైలు బయలు దేరిందన్నారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది ఏర్పడలేదన్నారు.

సీతాఫలం రైతుకు ఊరట

- కావిడి రూ.1600 పైమాటే
- పోటీపడి కొనుగోలు చేసిన వ్యాపారులు



సీతాఫలం తట్టలతో గిరిజనులు

అనంతగిరి: మండలంలో బుధవారం జరిగిన కాశీపట్నం వారపు సంతలో సీతాఫలాలకు గిరి రైతులు ఊహించని విధంగా ధర లభించింది. కా విడి పండ్లను రూ.1500కు వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి వ్యాపారులు సీతా ఫలాలను కొనుగోలు చేశారు. సీజన్ ముగుస్తున్నందున గిరి రైతులకు మంచి ధర లభించింది.